క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదల ముఖ్యం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: చిన్నారుల ఆరోగ్యంతోపాటు శారీరక ఎదుగుదల ముఖ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 22వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కౌన్సిలర్ ముస్తాక్‌తో కలసి ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో 22వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డును ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ వాణి, ఏఈ జనార్దన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రియాజ్, మన్సూర్‌ఖాన్, హాయిస్, ఇబ్రహీం, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న దృశ్యం

రొద్దం: మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించొచ్చని 'కల్పవల్లి' సీఈఓ చిరంజీవి అన్నారు. శుక్రవారం మండలంలోని కంబాలపల్లి ప్రాథమిక పాఠశాలలో టింబక్టీవ్–కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పడిన కల్పవల్లి కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఇంటర్‌ప్రెటేషన్ సెంటర్ ద్వారా పిల్లలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. పర్యావరణ విద్యలో భాగంగా ఉమ్మడి భూముల సంరక్షణ, పచ్చదనం అభివృద్ధిపై వివరించారు. 150 రకాల మొక్కలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేంద్రరెడ్డి, కల్పవల్లి టీం సభ్యులు కె.రవి, రామన్న, రైతులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య కార్యకర్త మృతి



వన్నూరక్క (ఫైల్)

అమరాపురం: కే శివరం ఆరోగ్య సబ్ సెంటర్ ఆరోగ్య కార్యకర్త వన్నూరక్క (51) శుక్రవారం తెల్లవారజామున బసవనపల్లిలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె మృతి పట్ల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని శెట్టూరులో అంత్యక్రియలు నిర్వహించారు. హేమావతి పీహెచ్‌సీ డాక్టర్ భార్గవ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు వన్నూరక్క మృతదేహం వద్ద నివాళులర్పించారు. డాక్టర్ భార్గవ్ అంత్యక్రియల కోసం రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. మృతురాలికి భర్త సోమనాథ్‌రెడ్డి, కుమారుడు సాయి ఉన్నారు.

పాదయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

రొద్దం: ఈనెల 29న శ్రీరామ భక్త మండలి ఆధ్వర్యంలో రొద్దం పెద్దాంజనేయస్వామి ఆలయం నుంచి కర్ణాటక రాష్ట్రం నాగలమడక సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం వరకు చేయనున్న పాదయాత్ర పోస్టర్లను శుక్రవారం అర్చకుడు గిరీష్‌స్వామి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. 29న ఉదయం 5 గంటలకు గిరీష్‌స్వామి ప్రత్యేక పూజల అనంతరం పాదయాత్ర ప్రారంభిస్తామని స్వామి తెలిపారు.

శుభకార్యం

హిందూపురం అర్బన్: మండలంలోని కిరికెర వైఎస్సార్‌సీపీ కాలనీలో పార్టీ కార్యకర్త మహబూబ్‌బాషా కూతురు తసీనా–ఇనాయత్ వివాహం శుక్రవారం నిర్వహించారు. హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక వారి స్వగృహానికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీడీ సాయికృష్ణ

గుడిబండ: అనంతపురంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో గుడిబండ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ సాయికృష్ణ, పీఈటీ అజార్ తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో దీపిక, బాలుర విభాగంలో చేతన్, అండర్–14 బాలికల విభాగంలో చరిత, బాలుర విభాగంలో గురుచరణ్ ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్న సురక్షతో ఆరోగ్యానికి భరోసా

● ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



హరేసముద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం హరేసముద్రం ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది వైద్య చికిత్సలు ఎలా అందిస్తున్నారని రోగులను అడిగి తెలుసుకున్నారు కార్పొరేట్ తరహాలో గ్రామ స్థాయిలోనే మెరుగైన వైద్యం అందిస్తున్నారని ప్రజలు వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టిహారం పదర్శనను పరిశీలించారు. ఎమ్మెల్యే రోగులకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు భార్గవి, వినోద్‌కుమార్, నరేష్,బాషా, సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు పైసా ఖర్చు లేకుండా వైద్య చికిత్సలతో పాటు కంటి పరీక్షలను నిర్వహించి మందులు, అద్దాలు అందిస్తున్నారన్నారు. సర్పంచ్ కరియన్న, ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీ మూర్తి, జెడ్పీటీసీ సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగళి: హళ్లికెర గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని హాజరై చికిత్సలు ఎలా అందిస్తున్నారని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. సర్పంచ్ ముద్దరాజు,స్పెషలాఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ రవి ప్రసథ్, తహసీల్దార్ జమానుల్లాఖాన్, డాక్టర్లు శివానంద, గాయత్రి తదితరలు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని ఊటుకూరు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల ఆధ్వర్యంలో వైద్యులు అఫ్తాబ్, సురేష్ కుమార్ నేతృత్వంలో పలువురికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, మాత్రలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, స్పెషలాఫీసర్ ప్రసాద్‌రావు, ఊటుకూరు సర్పంచ్ దిలీప్‌కుమార్ యాదవ్, ఎంపీటీసీ అమరావతి, సచివాలయ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్ష అని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం దేవరహట్టిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ రాధమ్మ, మండల కన్వీనర్ యంజారేగౌడు, ఎంపీడీఓ రామారావు, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, సర్పంచ్‌లు సతీష్, లక్ష్మీనారాయణ, రంగస్వామి ఈఓఆర్డీ నాగరాజునాయక్ పాల్గొన్నారు.

అమరాపురం: హలుకూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. ఎంపీడీఓ మునిస్వామి, తహసీల్దార్ రమేష్‌బాబు, సర్పంచ్ హనుమక్క తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదల ఆరోగ్యానికి రక్ష అని హిందూపురం పట్టణ వైఎస్సార్‌సీపీ బి బ్లాక్ కన్వీనర్ వాల్మీకి నరేష్ అన్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి కాలనీ వాసులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామాంజి, స్థానిక నాయకులు నాగిరెడ్డి, భారతి, ప్రసాద్, రత్నమ్మ, మహిళానాయకులు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేష్‌కుమార్



హిందూపురం: విద్యానగర్‌లో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



హళ్లికెరలో రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ నళిని

ఎస్పీని కలసిన చౌళూరు మధుమతిరెడ్డి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ మాధవరెడ్డిని హిందూపురం వైఎస్సార్‌సీపీ నేత చౌళూరు మధుమతిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తన సోదరుడు చౌళూరు రామకృష్ణారెడ్డి హత్యకు గురై ఏడాది పూర్తయిందని, ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని కోరారు. అలాగే ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించడంతోపాటు తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

డీజీ లాకర్ యాప్‌పై అవగాహన

హిందూపురం టౌన్: డీజీ లాకర్ యాప్‌ను ఉపయోగించి మార్కుల జాబితా పొందడంపై విద్యార్థినులకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. జిల్లా వృత్తి విద్యాధికారి రఘునాథరెడ్డి అధ్యక్షతన ప్రిన్సిపాల్ మురళీమోహన్, మహిళా డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు నందిని సమక్షంలో విద్యార్థినులకు డీజీ లాకర్ యాప్ గురించి వివరించారు. గత సంవత్సరంలో కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినుల మార్కుల జాబితాలను డీజీ లాకర్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేయించారు. విద్యార్థినులు ఈ యాప్‌ను ఉపయోగించుకుని మార్కుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవాలని వారు సూచించారు.

కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలు



హరేసముద్రం ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. హరేసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండో విడత నాడు–నేడు కింద రూ.1.8 కోట్లతో జరుగుతున్న పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యార్థులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. మడకశిర నియోజకవర్గంలో నాడు–నేడు ద్వారా దాదాపు 284 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.60 కోట్లతో పనులు చేపట్టారన్నారు. సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్రయాదవ్, ఎస్సీ సెల్ మండల నాయకులు లక్ష్మీనారాయణ, జమ్మానిపల్లి మూర్తి, తాలుకా బూత్ కమిటీ మేనేజర్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'విగ్రహ ఏర్పాటుతో సంబంధం లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న మండల కురుబ సంఘం నాయకులు

గోరంట్ల: స్థానిక సెరికల్చర్ కార్యాలయం సమీపంలో కనకదాస విగ్రహ ఏర్పాటు విషయం తమకు సంబంధంలేదని కురుబ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు వెంకటేషు, అధ్యక్షుడు గిరిధర్ అన్నారు. శుక్రవారం గోరంట్లలో కురుబ సంఘం మండల నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ జిల్లా కురుబ సంఘం ఆదేశాల మేరకు మండల సంఘం నాయకులు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే దారిలో విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. అయితే కురుబ సంఘానికి ఏమాత్రం సంబంధంలేని ఓ వ్యక్తి సంఘం పేరుతో తన సొంత పొలంలో విగ్రహం ఏర్పాటు చేసి, ఈనెల 19న ఆవిష్కరిస్తున్నట్లు తెలిసిందన్నారు. కార్యక్రమంలో కురుబ సంఘం మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు దేవానంద, రామోహన్, మహేంద్రం, సోముశేఖర్, కిష్టప్ప, ఈశ్వరప్ప, మల్లికార్జున,శంకర, శివప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వళ్లూరు పీడీఓ సస్పెన్షన్

పావగడ: తాలూకా లోని వళ్లూరు పీడీఓ(పంచాయతీ అభివృద్ధి అధికారి) సుదర్శన్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు తుమకూరు జెడ్పీ సీఈఓ ప్రభు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. సీకే పురం పీడీఓగా పని చేసిన సమయంలో 15వ ఆర్థిక యోజన కింద రూ 1.69 కోట్ల నిధులను దుర్వినియోగం చేశాడన్న ఆరోపణలతో సస్పెన్షన్ చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రొళ్ల: బాజయ్యపాల్యం గ్రామానికి చెందిన తిమ్మరాజు అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తీసుకువచ్చి అక్రమంగా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు శుక్రవారం ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. అతని నుంచి 17 (90ఎంఎల్) మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఎస్పీని కలసిన ఎస్ఐ

పుట్టపర్తి టౌన్: పెనుకొండ కియా పోలీస్టేషన్ ఎస్ఐ రమేష్ శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్ఐకి ఎస్పీ సూచించారు.

భూపంపిణీని నవరత్నాల్లో చేర్చండి

పెనుకొండ: భూపంపిణీని నవరత్నాల్లో చేర్చాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్ కోరారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర భూసదస్సు కార్యక్రమం నిర్వహించారు. సదస్సులో వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకూ భూపంపిణీ కార్యక్రమం చేపట్టలేదని, వెంటనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. గతంలో దివగంత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ఆర్ భూపంపిణీ చేపట్టారని, ఆయన బాటలో నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూపంపిణీ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభాకరరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ శివనాగరాణి, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, పెద్దన్న, ఈఎస్. వెంకటేష్, గంగాధర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావ్ శుక్రవారం తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 9110584835లో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం



హనుమంతరాయప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మడకశిరరూరల్: ఎం రంగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతరాయప్ప (64) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సర్పంచ్ రామలింగమ్మ, తాలుకా వైఎస్సార్‌సీపీ బూత్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, మండల ఎస్సీ సెల్ నాయకుడు జమ్మానిపల్లి మూర్తి, సీఎస్ మండల కన్వీనర్ నాగేంద్రయాదవ్ ఎం రంగాపురం వెళ్లి హనుమంతరాయప్ప మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులు, ఎంపీటీసీ సునీతను పరామర్శించారు.

పాఠశాల అభివృద్ధికి నగదు అందజేత

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2007–2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం శుక్రవారం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అగళి: వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మినాయక్ సూచించారు. ఆయన శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం క్వారీలకు వెళ్లి కార్మికులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పీ బ్యాడగెర సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ శివానంద, మాలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా, సూపర్‌వైజర్ నరసారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం



మొదటి స్థానంలో నిలిచిన పి.హాజిరాఫాతిమాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

హిందూపురం: మొదటి ఏడాది ఫార్మసీ ఫలితాల్లో హిందూపురం పాలిటెక్నిక్స్ కళాశాల విద్యార్థినులు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచించారని ప్రిన్సిపాల్ హరీష్‌బాబు తెలిపారు. హిందూపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థిని పి.హాజిరా ఫాతిమా 992/1000 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. వరుసగా రెండేళ్లు ఉత్తమ మార్కులు సాధించి హిందూపురం పాలిటెక్నిక్ కళాశాల రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. అలాగే కళాశాల నుంచి ఎస్.సాదియబాను 978, మార్కులు ఎస్.అర్షియాబాను 971 మార్కులు సాధించారన్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థినులను అభినందించి మెడల్స్ అందజేశారు.

యుద్ధాలు అభివృద్ధికి ఆటంకాలు



మౌలానా జర్జీస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం: యుద్ధాలు అభివృద్ధికి అంటకాలని సామాజిక సేవకుడు, వ్యాఖ్యత మౌలానా జర్జీస్ అన్నారు. సలఫియా ముతవల్లి మసీదు కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మసీదు ఆవరణలో ఆయనకు ఘన సన్మానం చేశారు. ముస్లిం నగారా ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఖాన్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా అధ్యక్షతన ఆయనకు 2023 షహీద్ టిప్పు సుల్తాన్ శాంతి సేవా పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ముతవల్లీ జావీద్. అమీర్, ఇబ్రహీం, క్రిస్టియన్ నాయకులు డాక్టర్ నాగేంద్ర కుమార్. దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు హనుమంతు యునైటెడ్ సిఖ్ నాయకులు పల్వందర్ సింగ్. బీఎస్పీ నాయకులు, దండోరా నాయకులు పాల్గొన్నారు.

కొల్హాపురి మహాలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు



అలంకరణలో మహాలక్ష్మీదేవి

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీ పూజ చేశారు. అనంతరం అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి భక్తులు కానుక రూపంలో తీసుకుచ్చిన పట్టు వస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకుడు జ్ఞానేంద్రబాబు తీర్థప్రసాదం అందజేశారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

ఓడీచెరువు: మండలంలోని కదిరి–హిందూపురం ప్రధాన రహదారిపై అల్లాపల్లి, గౌనిపల్లి మధ్యలో శుక్రవారం హిందూపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. కండక్టర్ రాజేశ్వరి, జీనులవాండ్లపల్లికి చెందిన రమణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హైవే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో వేగంగా వెళ్తున్న బస్సు రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లడంతో ప్రమాదం జరిగింది. ఇద్దరు మినహా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

బేల్దారికి గాయాలు

ధర్మవరం రూరల్: పట్టణంలోని గిర్రాజు కాలనీకి చెందిన రామాంజనేయులు అనే బేల్దారి శుక్రవారం గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మల్లాకాలువ గ్రామంలో నరసింహస్వామి గుడి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ గోడ కూలింది. అక్కడే చెక్కపై నిలబడిన రామాంజనేయులు కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

బాల్య వివాహాలు అరికడదాం



మాట్లాడుతున్న తహసీల్దార్ హసీనాసుల్తానా



మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొళ్ల: బాల్య వివాహాలను సమూలంగా అరికడదామని తహసీల్దార్ హసీనాసుల్తానా పేర్కొన్నారు. శుక్రవారం రత్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, ఆర్డీటీ చైల్డ్ కోఆర్డినేటర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను తెలియజేశారు. గుడ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఇంటి నుంచి పాఠశాలకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ఆకతాయిలు వేధిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 100, 112తో పాటు ఐసీడీఎస్ వారికి సమాచారం ఇవ్వాలని బాలికలకు సూచించారు. హెచ్‌ఎం ప్రభాకర్, వెలుగు సీసీ రంగనాథ్, ఆపద మిత్ర పరమేష్, మహిళ పోలీస్ అరుణ, అంగనవాడీవర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని నాగలూరులో బాల్యవివాహాలపై టింబక్టు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కారక్రమాన్ని నిర్వహించారు. నేటి సమాజంలో చదువుకున్న మహిళల ప్రాధాన్యత, మహిళలు ఎదుర్కొంటున్నసమస్యలపై నాటిక ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఈవో రమీజ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

28న మహర్షి వాల్మీకి జయంతి

పావగడ: ఈ నెల 28 న తాలూకా కార్యాలయం మీటింగ్ హాలులో వాల్మీకి జయంతి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వరదరాజు తెలిపారు. స్థానిక తాలూకా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు సభలో ఆయన మాట్లాడారు. తొలుత స్థానిక కుమార స్వామి లే అవుట్ లోని వాల్మీకి ఆలయంలో వాల్మీకి ప్రతిమకు ఘనంగా పూజలు నిర్వహించి అనంతరం తాలూకా కార్యాలయంలో జయంతి నిర్వహిస్తామన్నారు. స్థానిక వాల్మీకి సంఘం నాయకులు శివప్ప నాయక, పాళేగార్ లోకేశ్, బ్యాంకు సీనప్ప, రామాంజినప్ప, డా ఓంకారనాయక, రోటరి నారాయణప్ప, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలు తీసుకోండి

పావగడ: లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్న స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త చెలువమ్మపై చర్యలు తీసుకోవాలని బీకే హళ్లి గ్రామస్తులు స్థానిక స్త్రీ సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ సుధకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిగుడ్లు, శనగపిండి, అన్నం పులుసు, చిక్కీలు తదితర పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. అనంతరం సీడీపీఓ నారాయణకు సూపర్‌వైజర్ సుధ అంగన్‌వాడీ కార్యకర్త వైఖరిపై నివేదిక అందించారు.